సాక్షి
కామారెడ్డి
గురువారం । 18 । ఏప్రిల్ । 2024



రాముడి జీవితం ఆదర్శం

శ్రీరామచంద్రుడి జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన సుగుణాలు ఆచరణీయమని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



యువత తలచుకుంటే..

యువత తలచుకుంటే ఏదైనా సాధించగలదని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
44.2 /22.3

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురియవచ్చు.

న్యూస్‌రీల్

ఆటో కార్మికుల నిరసన బాట

కామారెడ్డి అర్బన్: ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పడుతున్నట్లు ఆటో యూనియన్ రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి బోదాసు నర్సింలు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు కోరినా ఫలితం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈనెల 24న తహసీల్దార్‌లకు, 26న కలెక్టర్లకు, 28న ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందిస్తామని తెలిపారు. మే మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త రథయాత్ర, 17 లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సదస్సులు, తర్వాత వరంగల్‌లో రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆందోళనలను విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్లను కోరారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పరిశీలించిన సీపీ



ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పులాంగ్ చౌరస్తా, నిఖిల్‌సాయి, కోర్టు, బైపాస్ రోడ్డు, కృష్ణ మందిర్ చౌరస్తాలకు వెళ్లారు. ఏ సమయాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని ట్రాఫిక్ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉదయం ఎప్పటి నుంచి రాత్రి ఎప్పటి వరకు కొనసాగుతున్నాయని తదితర వివరాలు అడిగారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తదితరులున్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బుధవారం బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, కార్యదర్శి మేకల రాములు, జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్ల సతీష్ తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మద్నూర్(జుక్కల్): అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని లీడింగ్ ఫైర్‌మన్ నర్సింలు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే ఘటనా స్థలానికి వెంటనే చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తామన్నారు. ఫైర్ సిబ్బంది వచ్చేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను ప్రజలకు వివరించారు.

పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో హోమం

రుద్రూర్: మండల కేంద్రంలోని పతంజలి యోగా భవనంలో సన్యాసి దివస్‌ను పురస్కరించుకుని బుధవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా సమితి తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ మహజన్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆయుర్వేదాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు బాబా రాందేవ్ మల్టీ నేషనల్ కంపెనీలతో పోరాడుతున్నారన్నారు. ఆయనకు మద్దతుగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో యోగా సమితి అధ్యక్షుడు కేవీ మోహన్, ప్రతినిధులు జీలు ఎస్.బాల్‌రాజ్, పురుషోత్తం, శ్రీనివాస్, శంకర్, పుట్టి ప్రకాశ్, ప్రవీణ్, రాములు, ఇందూర్ జ్యోతి పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

- జిల్లాలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- పలుచోట్ల శోభాయాత్రలు



జిల్లా కేంద్రంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జిల్లాలో బుధవారం శ్రీరామ నవమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించి, వడపప్పు, బెల్లం పానకాలను ప్రసాదంగా పంచారు. ఈ సందర్భంగా జైశ్రీరాం నినాదాలతో ఆలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. సాయంత్రం పలు చోట్ల శోభాయాత్రలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్మశాల వద్ద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి సిరిసిల్ల రోడ్, స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, పాంచ్‌రస్తా, గోపాలస్వామిరోడ్, పెద్దబజార్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, విద్యానగర్‌కాలనీ, జన్మభూమి రోడ్ మీదుగా దేవునిపల్లి అంబేడ్కర్ విగ్రహం వరకు శోభాయాత్ర సాగింది. యాత్రలో భారీ శ్రీరాముడి విగ్రహంతోపాటు, శివుడు, గరుడపక్షి, ఛత్రపతి శివాజీ, సింహం విగ్రహాలు పట్టణవాసులను ఆకర్షించాయి. కళాకారుల నృత్యాలు అలరించాయి. – కామారెడ్డి టౌన్




దేవునిపల్లిలో కల్యాణం జరిపిస్తున్న వేద పండితుడు



శోభాయాత్రలో ఎమ్మెల్యే కేవీఆర్, ఎంపీ బీబీ పాటిల్

ఘర్ వాపసీ!

- పార్టీని వీడి వెళ్లినవారిపై కాంగ్రెస్ ఫోకస్
- ఇప్పటికే సొంతగూటికి చేరిన పలువురు నేతలు
- అదే బాటలో మరికొందరు..



లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఘర్ వాపసీపై దృష్టి సారించింది. గతంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన వారిని సొంత గూటికి తీసుకురావడానికి ఆ పార్టీ నేతలు కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలువురు సొంతగూటికి రాగా.. మరి కొందరు అదే బాటలో ఉన్నట్లు తెలుస్తోంది. – సాక్షి, కామారెడ్డి

ప్రత్యర్థులను బలహీనపరచడంతోపాటు తమ బలాన్ని పెంచుకోవడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ వలసలపై దృష్టి సారించింది. దశాబ్ద కాలంలో వివిధ కారణాలతో పార్టీని వీడి వెళ్లిన నేతలు తిరిగి సొంతగూటికి చేరేలా చర్యలు చేపట్టింది. దీంతో మూడు నాలుగు నెలల్లో ఉమ్మడి జిల్లాలో పలువురు పాత నేతలు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరారు. కామారెడ్డి పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు మామిండ్ల అంజయ్య గతంలో కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన భార్య కాంగ్రెస్ నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, జెడ్పీటీసీగా పనిచేశారు. తర్వాత ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన బుధవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల దోమకొండతోపాటు బీబీపేట, భిక్కనూరు మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు హస్తం పార్టీలోకి వస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు అధికార పార్టీలో చేరిపోయారు. జుక్కల్ నియోజకవర్గంలోనూ మండల స్థాయి నేతలు పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత కూడా సొంతగూటికి చేరుకున్నారు.

మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రాజకీయ జీవితం కాంగ్రెస్‌తోనే మొదలైంది. నిజామాబాద్‌లో కార్పొరేటర్‌గా పనిచేసిన ఆయన ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన జుక్కల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ప్రయత్నించినా అవకాశాలు రాలేదు. అయితే ఎస్సీ సామాజిక వర్గంతోపాటు క్రిస్టియన్లు, ఇతర వర్గాల వారితో ఉమ్మడి జిల్లాలోనే కాక రాష్ట్ర స్థాయిలోనూ ఆయనకు మంచి సంబంధాలున్నాయి. ఎన్నికల సమయంలో ఆయన కీలక భూమిక పోషిస్తారన్న పేరుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ఆయనను తిరిగి సొంత గూటికి తీసుకువచ్చారు. మాచారెడ్డి సింగిల్‌విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఆయన సైతం గతంలో కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేశారు. మరికొందరు నేతలు సైతం సొంత గూటికి చేరతారని తెలుస్తోంది.

ఇతర నేతలపైనా దృష్టి..

ఘర్ వాపసీతోపాటు ఇతర పార్టీల్లోని నేతలపైనా కాంగ్రెస్ దృష్టి సారించింది. కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన ఇందుప్రియను ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇటీవలి కాలంలో మరికొందరు కౌన్సిలర్లు సైతం బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారు. దీంతో బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి దింపేసి, ఇందుప్రియను చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెట్టారు. బీఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీబీపేట మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్ రెడ్డి తదితరులు ఇప్పటికే హస్తం కండువా కప్పేసుకున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నా కొద్దీ వలసల జోరు మరింత పెరిగే అవకాశాలున్నాయి.

బీఈడీ కళాశాలలపై కొరడా!

- కనీస సౌకర్యాలు లేకపోతే అనుమతి నిరాకరణ
- నేటి నుంచి కళాశాలల్లో తనిఖీలు



బోధన్‌లోని బీఈడీ కళాశాల తరగతి గది

నిజామాబాద్‌అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బీఈడీ కళాశాలలపై అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. ఈ ఏడాది బోధన ప్రారంభం కాకముందే కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. సక్రమంగా ఉన్న కళాశాలలకే అనుమతి లభించేలా చర్యలు తీసుకోనున్నారు.

కొన్నేళ్లుగా అదే తీరు..

జిల్లా వ్యాప్తంగా 14 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో వంద సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పిస్తున్నారు. మూడు కళాశాలలో 50 సీట్లకు అనుమతి ఉంది. కానీ బీఈడీ కళాశాలలు ఎన్‌సీఈటీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనల ప్రకారం కళాశాలలు కొనసాగాలి. కనీస సౌకర్యాలైన తాగునీరు, బాత్‌రూంలు, ఫర్నీచర్ ఏర్పాటు, బోధకుల ఏర్పాటు, ప్రతిరోజూ బోధన కొనసాగాలి. ఇవి కచ్చితంగా అమలు కావాల్సి ఉండగా జిల్లాలో ఆయా కళాశాలల్లో కొనసాగడం లేదు. 16 మంది రెగ్యులర్ బోధకులు కచ్చితంగా ఉండాలి. కానీ ఎక్కడా లేదు. నగరంలోని ఓ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు పాఠశాలలో కొనసాగుతోంది. కేవలం ఒక్క గదిలోనే విద్యాబోధన చేపడుతున్నారు. విద్యార్థులు కళాశాలకు రాకుండానే విద్యాబోధన కొనసాగుతుంది. సొంత భవనాలు లేవు. నగర శివారులోని ఓ బీఈడీ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నా విద్యాబోధన చేపట్టడం లేదు. కేవలం విద్యార్థులను పరీక్షలకు మాత్రం అనుమతి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. బోధన్‌లోని ఓ కళాశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. భవనం సక్రమంగా లేదు. కనీస సౌకర్యాలు కొనసాగడంలేదు. ఆర్మూర్‌లోని మరో కళాశాల లాడ్జి భవనంలో కొనసాగుతోంది. ప్రతి కళాశాలలో విద్యార్థులు రాకపోయినా వారి వద్ద డబ్బులు వసూలు చేసి అటెండెన్స్‌ను కొనసాగిస్తున్నారు. ఫ్యాకల్టీ మాత్రం ఎక్కడా లేదు. ఒక్కరు ఇద్దరితో కళాశాలను నడిపిస్తున్నారు. మేనేజ్‌మెంట్ సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు. ల్యాబ్ ఫ్యాకల్టీ అందుబాటులో ఉండదు. తరగతి గదిలో ఫర్నీచర్ కూడా అందుబాటులో లేదు. ఇదే స్థితిలో జిల్లాలోని బీఈడీ కళాశాలలు కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి.

నిబంధనలు పాటించని వాటిపై చర్యలు

నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకునేందుకు అకడమిక్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ నడుంబిగించారు. కళాశాలలను దారికి తీసుకురావడంపై దృష్టిసారించారు. దీనిలో భాగంగా నేటి నుంచి కళాశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టనున్నారు. సంబంధిత కళాశాలల్లో లోటుపాట్లను గుర్తించి మే చివరి వారం వరకు సంబంధిత కళాశాలలకు సౌకర్యాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వనున్నారు. లేదంటే సంబంధిత కళాశాలలకు ఈ ఏడాది బీఈడీ విద్యాబోధనకు అనుమతి రద్దు చేయనున్నారు. గతంలోనే ఇలాంటి కళాశాలల యజమాన్యాలను పిలిపించి పలుమార్లు సమావేశాలు నిర్వహించి పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా మార్పు రాకపోవడంతో ఈసారి కఠినంగా వ్యవహరించనున్నారు. కనీస వసతులు, ఫ్యాకల్టీ, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. గతంలో కొన్ని కళాశాలలు కోర్టు ద్వారా అనుమతి తీసుకొని అడ్మిషన్లు కొనసాగించారు. ఇలాంటి కళాశాలలపై ముందస్తుగానే అధికారులు న్యాయబద్ధంగా చర్యలు తీసుకోనున్నారు.

> **నిబంధనలు పాటించకపోతే చర్యలు**
>
> బీఈడీ కళాశాలలు నిబంధనల ప్రకారం కొనసాగవల్సిందే. లేదంటే చర్యలు తీసుకుంటాం. కళాశాలలను తనిఖీలు చేసి లోట్లు పాట్లను గుర్తిస్తాం. గడువులోగా మారితే మంచిదే. లేదంటే ఈ ఏడాది అడ్మిషన్లు కూడా రద్దు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా కళాశాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – చంద్రశేఖర్, తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్

నోటిఫికేషన్‌కు వేళాయె!

- పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం
- నేటి నుంచి నామినేషన్ల ఘట్టం షురూ..
- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- క్యాడర్‌ను సిద్ధం చేస్తున్న పార్టీలు

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ గురువారం వెలువడనుంది. ఆ వెనువెంటనే నామినేషన్ల ఘట్టం షురూ అవుతుంది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ వెలువడుతుండడంతో ప్రచార జోరు పెరగనుంది.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్‌ఎస్‌నుంచి గాలి అనిల్‌కుమార్ బరిలో ఉన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు ఇప్పటికే కార్యరంగంలోకి దిగారు. వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు. జనంతోనూ మమేకమవుతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఒకవైపు ఎండలు మండిపోతున్నా ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో పార్టీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. గురువారం నోటిఫికేషన్‌తోపాటే నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభమవుతుంది. 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

ఏర్పాట్లలో అధికారులు

ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం మునిగిపోయింది. పోలింగ్ నిర్వహణకు కావాల్సిన సిబ్బంది నియామకం, ర్యాండమైజేషన్ వంటి ప్రక్రియలు పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పక్కాగా నిర్వహించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా ప్రణాళికలు రూపొందించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి గడువు ముగియడంతో ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో వెలువరించనున్నారు.

మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

పార్లమెంట్ ఎన్నికలను మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇటీవలే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. జహీరాబాద్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ప్రకటించింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత జహీరాబాద్‌లో ఒక్కసారి గెలవని కాంగ్రెస్.. ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో సాగుతోంది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ఎన్నికల బాధ్యతలను తమపై వేసుకున్నారు. క్యాడర్‌తో నిత్యం సమావేశమవుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికలు పరీక్షగా మారాయి. ఓటమి అనంతరం పార్టీనుంచి పలువురు నాయకులు కాంగ్రెస్, బీజేపీలలోకి వెళ్లిపోయారు. దీంతో శ్రేణుల్లో నిరాశా నిస్పృహలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలలో గెలుపు ఆ పార్టీకి అత్యవసరం. వరుసగా రెండుసార్లు గెలుచుకున్న జహీరాబాద్ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఆ వర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తామని చెబుతున్న కమలనాథులు.. జహీరాబాద్ ఎంపీ స్థానంపై కన్నేశారు. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌ను తమ పార్టీలోకి చేర్చుకుని టికెట్టు కేటాయించారు. పాటిల్ తరఫున పార్టీ నేతలంతా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లడుగుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిష్మా, అయోధ్యలో రామాలయ నిర్మాణం అంశాలు కలసి వస్తాయని ఆశిస్తున్న బీజేపీ నేతలు.. విజయం కోసం వ్యూహాలకు పదునుపెడుతున్నారు. మూడు పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకోవడంతో నామినేషన్లు దాఖలు చేసిన తర్వాత ప్రచారం జోరందుకుంటుందని భావిస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కామారెడ్డి క్రైం: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల అధికారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఏప్రిల్ 26 నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. ముందస్తుగానే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌ను అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా అందించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. గురువారం నుంచి ఏప్రిల్ 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణపై రోజూ నివేదికలను సమర్పించాలన్నారు. దాఖలైన నామినేషన్‌ల వివరాలు, అభ్యర్థుల అఫిడవిట్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పగలు ఎండ.. రాత్రి వాన



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా డోంగ్లీ మండల కేంద్రంలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. పాల్వంచ మండలంలోని ఎల్పుగొండలో 43 డిగ్రీలు, రామారెడ్డిలో 42.9, బిచ్కుందలో 42.6, హసన్పల్లిలో 42.4, దోమకొండలో 42.4, పాత రాజంపేటలో 42.3, భిక్కనూరులో 42.2, మక్దుంపూర్‌లో 42.1, మేనూర్‌లో 41.8, తాడ్వాయిలో 41.7, గాంధారిలో 41.6, బీర్కూర్‌లో 41.4, బొమ్మదేవ్‌పల్లిలో 41, పెద్దకొడప్‌గల్, బీబీపేట, పిట్లంలలో 40.9, లింగంపేటలో 40.8, జుక్కల్, మాచాపూర్‌లలో 40.6, నస్రుల్లాబాద్‌లో 40.5, నాగిరెడ్డిపేట, పుల్కల్‌లలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోయ్యాయి. ఎండల తీవ్రత పెరగడంతోపాటు వడగాలులు వీయడంతో జనం ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నం వేళలో చాలాచోట్ల రోడ్లు బోసిపోయాయి.

కామారెడ్డిలో భారీ వర్షం

కామారెడ్డి పట్టణంలో బుధవారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంట పాటు వాన దంచికొట్టడంతో రోడ్లన్నీ జలమయమై వర్షకాలాన్ని తలపించాయి.

క్లుప్తంగా

శ్రీరాముడి జీవితం ఆదర్శం



బాన్సువాడ రూరల్: శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శనీయమని, రాముని సుగుణాలు ఆచరణీయం, అనుసరణీయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం ఆయన స్వగ్రామం పోచారంతో పాటు దేశాయిపేట్, సోమేశ్వర్, కొల్లూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో తన సతీమణి పుష్ప, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సోదరులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తిర్మలాపూర్‌లో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని కాసేపు భజన చేశారు.

ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబుతాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఎందుకు బిల్లు పెట్ట లేదో మాదిగలకు మోదీ సమాధానం చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న డిమాండ్ చేశారు. ఆయన బుధవారం తాడ్వాయిలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలు, మాదిగ ఉప కులాలను అధికార పార్టీలు మోసం చేస్తున్నాయని, రానున్న పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్‌లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. విద్యుత్ తీగల కింద పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల కార్యకర్తల సమావేశం నేటి ఉదయం 10 గంటలకు కామారెడ్డి పట్టణం రామారెడ్డి రోడ్డులో గల గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌లు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసం



దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో బుధవారం సాధనాశూరులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చెల్లూరు గ్రామానికి చెందిన రాజయ్య బృందం కొన్ని సంవత్సరాలుగా దోమకొండలో సాధనాశూరుల ఆటలు ఆడుతూ జీవనం సాగిస్తుంటారు. వీరికి కుల సంఘాల నుంచి ఆర్థిక సహాయం అందజేస్తారు. రాజయ్య బృందం కత్ర విన్యాసం, ముక్కులో నుంచి నీటిని తీయడం, తాళ్లపై ఒంటికాలి ప్రదర్శన వంటివి చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విన్యాసాలు నిర్వహించారు. పద్మశాలి సంఘం దోమకొండ అధ్యక్షుడు మ్యాక నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, కోశాధికారి గణేష్, సంఘం ప్రతినిధులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఆర్మూర్‌టౌన్: అగ్ని ప్రమాదాలు జరిగే భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. దీంతో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అగ్ని మాపక శాఖ అధికారులు ఎక్కడ ప్రమాదం జరిగిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేస్తారు. అగ్నిప్రమాదం జరిగిన చోట తమ ధైర్య సహసాలతో ముందుకు సాగి ప్రమాదాన్ని అరికడుతారు. 1944 ఏప్రిల్ 14న బాంబే ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదంలో 66మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ అధికారులు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన సిబ్బందికి నివాళులు అర్పించి, అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

చేపట్టే కార్యక్రమాలు

వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 14న అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. 15న బహిరంగ ప్రదేశాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, 16న అపార్ట్‌మెంట్‌లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 17న ఆస్పత్రిలలో, 18న ఎల్‌పీజీ గొడౌన్స్, 19 ఫంక్షన్ హాల్, విద్యాసంస్థలు, సినిమా థియటర్‌లలో, 20 అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ సేఫ్టీపై వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు వేళ్లేటప్పుడు గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. ఏసి, ఫ్రిడ్జ్ వైరింగ్ నాణ్యతను పరిశీలించాలి. ప్రమాదం జరిగితే ఆందోళన చెందకుండా మంటలను ఆర్పడానికి యత్నించాలి. ప్రమాదాలు జరిగితే వెంటనే 101, 8712699228 నంబర్లకు సమాచారం అందించాలి.

– మధుసూదన్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి, ఆర్మూర్

నివారణ చర్యలు

- కాల్చిన సిగిరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడేయొద్దు.
- వంటింట్లో గాలి, వెలుతుర ఉండేట్లు చూసుకోవాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా, కింద పడుకొని బొర్లాలి. లేక దుప్పటి చుట్టుకోవాలి.
- స్కూల్, షాపింగ్ మాల్‌లో, బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.

యువకులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే



పార్టీలో చేరిన చేరిన బైరాపూర్ యువకులతో బీబీ పాటిల్, అరుణతార

బాన్సువాడ: యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. బుధవారం బైరాపూర్ గ్రామానికి చెందిన యువకులు బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ ప్రభుత్వం కొనసాగుతుందంటే కారణం యువకులేనని అన్నారు. యువకులు ఎటు వైపు ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మోదీతోనే సాధ్యమని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో యువకులు బీజేపీకి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ల సాయికిరణ్, తదితరులున్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ నాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16న మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు రైతాంగానికి రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పారన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ ఐదు ఏళ్లలో జిల్లాలోని ఏ గ్రామంలో పర్యటించలేదని ఆరోపించారు. ఆయనకు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. మాధవ్‌నగర్ బ్రిడ్జికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.60 కోట్లు ఇస్తే కేంద్రం రూ.30 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఈ నెల 19న నామినేషన్ వేస్తునట్లు తెలిపారు.

ఇద్దరు బాలసదనం బాలికల అదృశ్యం

కామారెడ్డి క్రైం:బాలసదనంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ఇద్దరు బాలికలు కనిపించకుండా పోయారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లిన వారు బాలసదనంకు రాకుండా ఎక్కడికో వెళ్లి పోయారని ఫిర్యాదు రావడంతో పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తల్లిదండ్రులు లేని ఇద్దరు బాలికలు కామారెడ్డిలోని బాలసదనంలో ఉంటూ హరిజనవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ నెల 13 న పాఠశాలకు వెళ్లిన వారిద్దరూ కొద్దిసేపటి తర్వాత ఎవరికీ చెప్పకుండానే బయటకు వెళ్లిపోయారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలసదనం ఇన్‌చార్జి గంగుబాయి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీరిలో ఓ అమ్మాయి గతంలో రెండు సార్లు ఇదే విధంగా వెళ్లిపోగా వెతికి తీసుకువచ్చినట్లు బాలసదనం సిబ్బంది చెబుతున్నారు.

పంటను నాశనం చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

భిక్కనూరు: కొందరు పంటను నాశనం చేస్తున్నారని భిక్కనూరుకు చెందిన కౌలు రైతు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బోండ్ల స్వామి శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన మందుగుల సిద్దయ్య వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. భిక్కనూరుకు చెందిన ఎరుకల సాయిలు, ఎరుకుల చిరంజీవి తమ పందులను తాను సాగు చేస్తున్న పంటచేనులోకి పంపించి పంటలను నాశనం చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు స్వామి తెలిపాడు. వారిద్దరు గతంలో ఇలాగే చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా మళ్లీ అలాగే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

రాముల గుట్టలో కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని రాముల గుట్టలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు పాల్గొనడానికి వస్తున్నారన్నారు. గెలుపొందిన వారికి నగదును బహుమతిగా అందిస్తామన్నారు.

సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్, బ్రహ్మాజీవాడి, బ్రాహ్మణపల్లి, చందాపూర్, ఎర్రాపహాడ్ తదితర గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు శ్యాంరావు, సంజీవులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎలుపుగొండలో అగ్ని ప్రమాదంలో నివాసపు గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయిన ఇప్పల లక్ష్మీ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మల గంగులీరెడ్డి, ఇంతియాజ్ సాయం అందజేశారు. బుధవారం సాయంత్రం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



పిట్లం(జుక్కల్): మండలంలోని కుర్తి గేట్ సమీపంలో బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రోడ్డు కిందకు దూసుకెళ్లింది బాన్సువాడ నుంచి పిట్లం వైపు వెళ్తున్న బస్సు కుర్తి గేట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

క్రైం కార్నర్

గోదావరిలో ఈతకు వెళ్లి బాలుడి మృతి

రెంజల్: స్నేహితులతో కలిసి గోదావరి నదిలో ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కందకుర్తి గ్రామానికి చెందిన నవాజ్‌బేగ్(17) బుధవారం స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని మొగల్‌పుర ప్రాంతంలో గోదావరి నదిలో ఈతకు వెళ్లాడు. ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునగడంతో వెంటనే అతని స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికులతో పాటు రెంజల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని గాలించగా నవాజ్ మృతదేహం లభించింది. నవాజ్‌బేగ్ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై సాయన్న తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాం వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. మంగళవారం మోపాల్ నుంచి బోర్గాంకు బైక్‌పై వెళ్తున్న ప్రదీప్‌ను ఇస్మాయిల్ ఫ్యాక్టరీ వద్ద లారీ ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్ అప్సర్ అజాగ్రత్తగా నడపడంతో బైక్‌ను ఢీకొట్టినట్లు చెప్పారు. మృతుడి బావ నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న బస్సు



భిక్కనూరు: భిక్కనూరు టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు ముందు వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. వ్యాన్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. బస్సు అద్దాలు ధ్వంసం పగిలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నిజామాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన మార్వాడే దమపాల్ (33) మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ బుధవారం తెలిపారు. నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన ధమపాల్ మంగళవారం స్నేహితులు ఉమాకాంత్, వినోద్‌తో బైక్‌పై వెళ్తున్నాడు. బైపాస్ రోడ్డులో శ్మశానం వైపు యూటర్న్ చేస్తుండగా అర్సపల్లి వైపు నుంచి వస్తున్న బొలెరో ఢీకొంది. ప్రమాదంలో దమపాల్ అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుడి తండ్రి గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్పుగొండలో గుడిసె దగ్ధం



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయింది. గ్రామానికి చెందిన ఇప్పల్ల లక్ష్మి బుధవారం మధ్యాహ్నం శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలి బూడిదైంది. కుల సంఘంలో తీసుకున్న అప్పు చెల్లించడానికి తీసుకొచ్చిన రూ.లక్ష నగదు, సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్చికంపౌండ్‌లో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న సయ్యద్ బషీర్ అలియాస్ అజ్జును అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు. బుధవారం బెల్ట్‌షాపుపై దాడి చేసి 157 క్వార్టర్స్, 8 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని బెల్ట్ షాపులపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. మండలంలోని వడ్లం గ్రామంలో కిరాణం దుకాణాంలో మద్యం అమ్ముతున్న జ్ఞానేశ్వర్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

'శ్రీరామ'సేన శోభాయాత్ర



జిల్లా కేంద్రంలో శోభాయాత్ర



శోభాయాత్రలో బోనాలు



డప్పు వాయిద్యాలు

కామారెడ్డి టౌన్: శ్రీరామనవమి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బుధవారం పెద్ద ఎత్తున శ్రీరామసేన ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం ధర్మశాల ముందు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భారీ శ్రీరాముని విగ్రహంతో పాటు, శివుడు, గరుడపక్షి, ఛత్రపతి శివాజీ, సింహం విగ్రహాలతో పాటు డప్పు, నాసిక్‌డోల్ చప్పుళ్లు, కళాకారుల బృందాలు, బోనాలు, భక్తి పాటలు, డీజే సౌండ్, భారీ లైటింగ్‌లతో, నృత్యాలతో శోభాయాత్ర కొనసాగింది. పుర రోడ్లన్ని కాషాయ జెండాలతో, శ్రీరాముని నామసర్మరణతో మార్మోగింది. పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన స్టేజీ మీద ఎమ్మెల్యే రమణారెడ్డితో పాటు, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలని వారు పిలుపునిచ్చారు.

భిక్కనూరులో..



భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ దండు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బుధవారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ హన్‌మాన్ విగ్రహంతో పాటు సీతారాములు లక్ష్మణ, హన్‌మాన్ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రకు స్వాగతం పలికారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అఖండ హరినామ సప్తాహం



బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో అఖండ హరినామ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. గ్రామంలో పునర్నిర్మించిన రుక్మిణీ విఠలేశ్వర శివ పంచాయతన మహా సరస్వతి విగ్రహ శిఖర ప్రతిష్ఠాపనలో భాగంగా సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం చిన్నదేవాడకు చెందిన జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ వెంకటరమణరావు, తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణీ విఠలేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో పునర్నిర్మించిన రుక్మిణీ విఠలేశ్వర మందిరంలో గురువారం నుంచి విగ్రహ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మండపాన్ని ఏర్పాటు చేశారు. హైద్రాబాద్‌కు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో 4 రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

సేవాలాల్, జగదాంబ మాత..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): హాజీపూర్ సడక్ తండాలో బుధవారం సేవాలాల్, జగదంబా మాత



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల ఉత్సవంలో భాగంగా మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు.

అల్మాజీపూర్ పోచమ్మ ఆలయంలో వార్షికోత్సవం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అల్మాజీపూర్‌లో బుధవారం ముత్యాల పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, ఒడి బియ్యం పోశారు. గురువారం బోనాలు, శుక్రవారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నా కుమారుడిపై తప్పుడు కేసులు

- బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్

బోధన్: తనపై రాజకీయ శత్రుత్వంతో తన కుమారుడు రహీల్‌ను టార్గెట్ చేసి పోలీసులు హింసిస్తున్నారని బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ బుధవారం దుబాయ్ నుంచి విడుదల చేసి వీడియోలో ఆరోపించారు. రాజకీయ శత్రుత్వాలు మనం చూసుకుందామని, ఇందులో పిల్లలను ఇరికించి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. 2022 మార్చి 17న రాత్రి జూబ్లీ హిల్స్ రోడ్డులో తన కుమారుడి కారు ప్రమాద ఘటనపై మాజీ ఎమ్మెల్యే స్పందించారు. ఈ కేసులో తన కుమారుడిని ఇరికించేందుకు వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ నేతృత్వంలో పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పోలీసులు గంటల తరబడి విచారణ పేరిట హింసించారన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. తన కుమారుడి తప్పు నిరూపితమైతే ఉరిశిక్ష వేసినా అభ్యంతరం లేదన్నారు. ప్రమాదం జరిగిన రోజు తన కుమారుడు డ్రైవింగ్ చేయలేదని, అప్పట్లోనే పోలీసులు విచారణ జరిపి కేసులు నమోదు చేయడంతో పాటు చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టులో విచారణలో ఉందని వివరించారు. కారు యాక్సిడెంట్ కేసులో నిందితుడిగా ఉన్న డ్రైవర్‌ను బెదిరించి తన కుమారుడు డ్రైవింగ్ చేసినట్టు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని షకీల్ ఆరోపించారు. ఈ కేసు విషయంలో కోర్టులో పోరాడుతామన్నారు తన కుమారుడికి ఎలాంటి హాని జరిగినా డీసీపీ విజయ్ కుమార్,పంజాగుట్ట, జూబ్లీ హిల్స్ పోలీసు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

21 సెక్షన్లతో కేసులు పెట్టడం న్యాయమా?

ప్రగతి భవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో తన కొడుకు రహీల్‌పై 21 సెక్షన్లతో కేసులు నమోదు చేశారని, ఇది న్యాయమా అని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆ సమయంలో తాను దుబాయ్‌లో ఉన్నప్పటికీ ఎఫ్ఐఆర్‌లో తన పేరు చేర్చారన్నారు. రహీల్‌ను చట్టవిరుద్ధంగా అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారని, అయితే కోర్టు బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో తాను దుబాయ్‌లో చికిత్స తీసుకుంటున్నానని షకీల్ తెలిపారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి క్రైం: సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి అందజేశారు.ఇటీవల దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేయగా బుధవారం 5 ఫోన్‌లను రికవరీ చేశారు. ఆయా ఫోన్‌లను బాధితులైన గంగాధర్,ఇదాయత్,లక్ష్మి, ఆకాశ్, సురేశ్‌కుమార్ లకు ఎస్సై రాజు అప్పగించారు.

ఎల్లారెడ్డి: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసి బుధవారం అందించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన చిలుక సత్తయ్య, కంజర్ల సిమన్ ఫోన్లు చోరీకి గురి కావడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వాటి ఆచూకీని కనుక్కొని బాధితులకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన షేక్ లతీఫ్, ఎన్ అశోక్ అనే ఇద్దరు గతంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. బుధవారం ఎస్సై మోహన్‌రెడ్డి రికవరీ చేసిన సెల్‌ఫోన్లను వారికి అప్పగించారు. గత ఏడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోయిందని ఇద్దరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పూర్తి విచారణ చేపట్టి పోయిన సెల్‌ఫోన్ రికవరీ చేసి బాధితులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ఫోన్ బాక్స్, ఐఎంఈఐ నెంబరు తీసుకొచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మోహన్ రెడ్డి